క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన జర్నలిస్టులు

రాయచోటి టౌన్ : జర్నలిస్టుల పిల్లలకు కార్పొరేట్ పాఠశాలలో ఉచితంగా విద్యను అందించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్‌కు రాయచోటి జర్నలిస్టు సంఘాల నాయకులు కోరారు. శుక్రవారం ఆయన చాంబర్‌లో కలసి వినతి పత్రాన్ని అందజేశారు. దీనిపై స్పందించిన ఆయన విద్యాశాఖాధికారులతో మాట్లాడి ఉచితంగా కార్పొరేట్ విద్యను అందించే విధంగా సూచిస్తానని చెప్పారు. ఒక వేళ పూర్తిస్థాయిలో కాకపోయినా ఎక్కువ మొత్తంలో రాయితీలు కల్పించేందుకు ప్రయత్నిస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో రాయచోటికి చెందిన వివిధ సంస్థలకు చెందిన ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

నవోదయ విద్యాలయ ప్రవేశాలకు గడువు పెంపు

రాజంపేట : మండలంలోని నారమరాజుపల్లెలో ఉన్న జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరవ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు గడువును ఈనెల 25కు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ గీత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024- 25 విద్యాసంవత్సరానికి ఆరవ తరగతిలో ప్రవేశానికి ఉమ్మడి కడప జిల్లాలో ప్రభుత్వం, ప్రభుత్వంచే గుర్తింపబడిన పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థుల నుంచి దరఖాస్తులు చేసుకోవచ్చునన్నారు. పూర్తి వివరాలకు నవోదయ విద్యాలయ వెబ్‌సైట్‌ను సందర్శించవలసిందిగా తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.


మైక్ సెట్ వితరణ



మైక్‌సెట్‌ను అందిస్తున్న సుభాషిణి

పెనగలూరు : మండలంలోని చక్రంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పదవీ విరమణ పొందిన ఆంగ్ల ఉపాధ్యాయురాలు సుభాషిణి శుక్రవారం మైక్ సెట్‌ను వితరణ చేశారు. ఈ సందర్భంగా సుభాషిణి మాట్లాడుతూ పాఠశాలలో పనిచేసి పదవీ విరమణ పొందానని తన పేరు గుర్తు ఉండాలనే ఉద్దేశంతో మైక్ సెట్‌ను పాఠశాలకు అందించానన్నారు. అనంతరం పాఠశాల సిబ్బంది ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గోపాల కృష్ణ, ఉపాధ్యాయులు బి.హరి ప్రసాద్, అన్వర్‌బాషా, ప్రమీల, శ్రీవాణి, కృష్ణ కుమారి, పరిమళ, మహేంద్ర పాల్గొన్నారు.

భద్రకాళికి రాహుకాల పూజలు



ప్రత్యేక అలంకరణలో భద్రకాళి

రాయచోటి టౌన్ : శ్రీ భద్రకాళీ అమ్మవారికి శుక్రవారం రాహుకాల పూజలు నిర్వహించారు. అంతకుముందు అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేసి విశేషంగా అలంకరించారు. అమ్మవారికి నిమ్మకాయలపై వత్తులు వెలిగించి హారతులు పట్టారు. భక్తులకు శంకరయ్య, కృష్ణ స్వామి వారి ఆధ్వర్యంలో రాహుకాల పూజ విశేషాలను వివరించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంచి పెట్టారు. పూజలు ఆలయ పాలకమండలి అధ్యక్షురాలు పొలంరెడ్డి విజయ, ఆలయ ఈఓ డివి రమణారెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహించారు.

నేతాజీ ఆశయ సాధనకు కృషి చేయాలి



నేతాజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏఐఎస్‌బీ నేతలు

రాయచోటి అర్బన్ : స్వాతంత్ర్య సమరవీరుడు సుభాష్‌చంద్రబోస్ ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అఖిల భారత విద్యార్థి బ్లాక్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ కాలేషా పిలుపునిచ్చారు. శుక్రవారం ఏఐఎస్‌బీ కార్యాలయంలో సుభాష్ చంద్రబోస్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత స్వాతంత్ర్య పోరులో అమరుడైన నేతాజీ అడుగుజాడల్లో నడవాలన్నారు. జాతీయ ఉద్యమం వైపు ప్రజలను ఆకర్షితులను చేయడంతో పాటు ఆజాద్ హింద్ ఫౌజ్‌ను ఏర్పాటు చేసి, బ్రిటీషువారికి సింహ స్వప్నంగా నిలిచిన గొప్పనేత నేతాజీ అని కొనియాడారు. కార్యక్రమంలో ఏఐఎస్‌బీ నేతలు క్రిష్ణారెడ్డి, నాగేంద్ర, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

నివాళి

ఓబులవారిపల్లె : కొర్లకుంట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు పోలిన హరినాథరెడ్డి(40) అనారోగ్యంతో మృతి చెందాడు. శుక్రవారం ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి గ్రామానికి చేరుకొని మృతదేహానికి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. జిల్లా టూరిజం డైరెక్టర్ గుంటిమడుగు సుధాకర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉపకరణాలు అందిస్తాం

- విద్యా, వైద్యానికి ప్రభుత్వం ప్రాధాన్యత
- ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి



జగనన్న కాలనీలో భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే మేడా, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి, ఆర్‌డీఓ రామకృష్ణారెడ్డిలు



రాజంపేట టౌన్ : మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

రాజంపేట టౌన్ : పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరాయంగా పనిచేస్తున్నారని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి తెలిపారు. స్థానిక మన్నూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం దివ్యాంగులకు అవసరమయ్యే ఉపకరణాల కోసం నిర్వహించిన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. ఈ శిబిరంలో పాల్గొన్న దివ్యాంగులకు వారికి అవసరమయ్యే ఉపకరణాలను త్వరలోనే ప్రభుత్వం లబ్ధిదారులకు అందజేస్తుందన్నారు. కొన్ని ఉపకరణాలు లక్ష రూపాయల విలువ కూడా చేస్తాయన్నారు. పేదలను ఆదుకోవడమే లక్ష్యంగా జగన్ ప్రభుత్వం పనిచేస్తుందని, అందువల్ల పేద ప్రజలు ఎవరు కూడా అధైర్యపడాల్సిన అవసరం లేదన్నారు. విద్యా, వైద్యానికి అయ్యే పూర్తి ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందని, అలాగే వివిధ సంక్షేమ పథకాలతో పేదలను జగన్ ఆదుకుంటున్నారన్నారు. దివ్యాంగులు తమకు అవసరమయ్యే పరికరాలను కొనుగోలు చేయలేక ఇబ్బందులు పడుతున్నందున ప్రభుత్వం ఈ బృహత్తర కార్యక్రమాన్ని గత నాలుగు సంవత్సరాలుగా చేపడుతోందన్నారు. ప్రజలకు మేలు చేసే జగన్ ప్రభుత్వానికి ప్రజలు ఎప్పుడు అండగా ఉండాలని ఎమ్మెల్యే కోరారు. ఈ శిబిరంలో దాదాపు 430 మందికి పైగా దివ్యాంగులు పాల్గొన్నారు. కార్యక్రమంలో దివ్యాంగ, హిజ్రా, వయోవృద్ధుల సంక్షేమశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కృష్ణకిషోర్, సూపరింటెండెంట్ అనీల్, హెచ్‌ఎం పరిమళ, వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల కన్వీనర్లు వడ్డే రమణ, హస్తవరం ఉమామహేశ్వర్‌రెడ్డి, నారదాసు మధు, మిర్యాల సురేఖ, పాపినేని విశ్వనాథరెడ్డి, పోలి మురళీరెడ్డి, సత్యాల రామకృష్ణ, దాసరి పెంచలయ్య, రాజేష్, మురళీ ఆచారి, సునీల్, జ్యోతికృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

భోజన సౌకర్యం కల్పించిన ఎమ్మెల్యే

దివ్యాంగులకు అవసరమయ్యే ఉపకరణాల మంజూరునకు నిర్వహించిన శిబిరంలో పాల్గొన్న వారికి ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి తన సొంత డబ్బులతో భోజన సౌకర్యం కల్పించారు. పెద్దఎత్తున దివ్యాంగులు రావడంతో వారికి భోజన సౌకర్యం కల్పించారా? అని ఏడీ కృష్ణకిషోర్‌ను ఎమ్మెల్యే ప్రశ్నించారు. ఇందుకు ఆయన సమాధానం ఇస్తూ భోజనం ఏర్పాటు చేయలేదని చెప్పడంతో ఎమ్మెల్యే ఒకింత అసహనం వ్యక్తం చేశారు. సాయంత్రం వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని, భోజనం లేకుంటే ఆకలికి ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు ఎలా తట్టుకోగలరా అని ప్రశ్నించారు. అప్పటికే సమయం 11:30 గంటలు కావడంతో వీలైనంత త్వరగా వచ్చిన వారందరికీ భోజన సౌకర్యం ఏర్పాటు చేయమని తన వ్యక్తిగత సిబ్బందిని ఎమ్మెల్యే ఆదేశించి డబ్బులు ఇచ్చి పంపారు. ఎమ్మెల్యే దివ్యాంగుల ఆకలి గురించి ఆలోచించి భోజన సౌకర్యం కల్పించడం పట్ల వారు ఎమ్మెల్యే సేవా నిరతిని కొనియాడారు.

జగనన్న కాలనీకి భూమి పూజ

రాజంపేట రూరల్ : ప్రతి ఒక్కరికి సొంతింటి కలను సాకారం చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న కాలనీలను నిర్మిస్తున్నారని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డిలు తెలిపారు. మండల పరిధిలోని తొగురుపేట గ్రామంలో నిర్మించబోయే జగనన్న కాలనీకి ఆర్‌డీఓ రామకృష్ణారెడ్డితో కలిసి శ్రావణమాసం తొలి శుక్రవారం పురస్కరించుకొని వారు భూమిపూజ చేసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న కాలనీలను అన్ని వసతులతో సర్వాంగ సుందరంగా నిర్మిస్తూ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. జగనన్న కాలనీలు ఎంతో మందికి సొంతింటి కలను సాకారం చేస్తున్నాయని తెలియజేశారు. మహిళా సాధికారత చెందాలనేది జననేత లక్ష్యమని తెలియజేశారు. ముందుగా తొగురుపేటలోని దాసాలమ్మ ఆలయంలో ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్‌లు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. పూజా కార్యక్రమంలో తహసీల్దార్ ముద్దా సుబ్రమణ్యంరెడ్డి, గృహ నిర్మాణశాఖ ఏఈ కుప్పుస్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు పోలి మురళీరెడ్డి, గుండు మల్లికార్జునరెడ్డి, పి.విశ్వనాథరెడ్డి, అరిగెల సౌమిత్రి, ఇబ్బు, పి.శంకరశెట్టి, అనాల మధుయాదవ్, మధురాజు, కిరీటీ, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

తాళ్లపాక చెన్నకేశవుడికి వెండికాసుల హారం



హారాన్ని అందజేస్తున్న తోట శ్రీనివాస ధీరజ్

రాజంపేట : తాళ్లపాకలో వెలసిన చెన్నకేశవస్వామికి ఏపీ న్యాయవృతిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తోట శ్రీనివాస ధీరజ్ వెండికాసులు హారాన్ని స్వామి వారికి సమర్పించారు. శుక్రవారం టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాలాజీ, అర్చకులు నరేష్‌కు హారాన్ని ఆలయ ప్రాంగణంలో అందజేశారు.

కర్ణాటక మద్యం పట్టివేత

బి.కొత్తకోట: కర్ణాటక మద్యం తరలిస్తున్న ఐదుగురు వ్యక్తులను శుక్రవారం ఉదయం అరెస్ట్ చేశామని మదనపల్లె సెబ్ సీఐ శ్రీహరిరెడ్డి చెప్పారు. ఆయన కథనం మేరకు వివరాలు..బి.కొత్తకోట మండలం చలిమామిడికి చెందిన యు.రెడ్డెప్ప (39), యు.ఉత్తన్న (37)లు కర్ణాటక మద్యాన్ని దిగుమతి చేసుకుని గ్రామీణ ప్రాంతాల్లో విక్రయించుకునే వారికి సరఫరా చేస్తుంటారు. శుక్రవారం కర్ణాటకలోని రాయల్పాడు నుంచి మద్యం బాక్సులను తీసుకొచ్చి రెడ్డెప్ప, ఉత్తన్నలకు అందజేశాడు. వీరిద్దరూ గట్టుకు చెందిన పలక శ్రీనివాసులు, తేట అంజప్ప, పాకాల రమణలతో కలిసి కర్ణాటక మద్యం విక్రయించేందుకు తీసుకెళ్తుండగా గట్టు చెరువుకట్ట వద్ద దాడులు నిర్వహించి నిందితులను అరెస్ట్ చేశారు.

వార్డు ఉప ఎన్నికలకు భారీ బందోబస్తు



మాధవరం-1లోని 2వ వార్డు పోలింగ్ బూత్ పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్‌ఐ లక్ష్మినారాయణ

సిద్దవటం : మండలంలోని మాధవరం-1, ఉప్పరపల్లె గ్రామ పంచాయతీలో శనివారం జరుగుతున్న వార్డు సభ్యుల ఉప ఎన్నికలకు భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ లక్ష్మినారాయణ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాధవరం-1 గ్రామ పంచాయతీలోని పోలింగ్ బూత్‌ను పరిశీలించి పోలింగ్ కేంద్రాల సరిహద్దుల్లో మార్కింగ్ వేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉప ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటలను జరగకుండా ప్రజలు తమ ఓటు హక్కును ప్రశాంతంగా వినియోగించుకోవాలన్నారు. పోలింగ్ జరిగే ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఎవరైనా పోలింగ్ కేంద్రాల వద్ద ఘర్షణలకు పాల్పడి, పోలింగ్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ చంద్రనాయక్, పోలీసులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి తదిరతులు పాల్గొన్నారు.

ఉప ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

వార్డు సభ్యుల ఉప ఎన్నికలకు అన్నీ ఏర్పాట్లను పూర్తి చేశామని జిల్లా సహాయ ఎన్నికల అథారిటీ అధికారి జవహర్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన ఉప ఎన్నికలు జరుగుతున్న రెండు గ్రామ పంచాయతీల్లోని పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉప ఎన్నికలకు సంబంధించి బ్యాలెట్ పెట్టెలు, బ్యాలెట్ పేపర్‌లు, ఓటర్ల జాబితా వంటి మెటీరియల్స్‌ను ఆయా పోలింగ్ కేంద్రాల అధికారులకు అందజేశామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో అన్నీ మౌలిక దుపాయాలను కల్పించామన్నారు. పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు అందరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో మాధవరం-1 గ్రామ పంచాయతీ కార్యదర్శి లక్ష్మినరసయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉప ఎన్నికకు సిద్ధం

లక్కిరెడ్డిపల్లె : లక్కిరెడ్డిపల్లె పంచాయతీ 2 వ వార్డుకు జరుగుతున్న ఉప ఎన్నికకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. డీపీఓ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి ఏర్పాట్లపై ఆరా తీశారు. ఓటర్లకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేయాలని రిటర్నింగ్ అధికారి చక్రేనాయక్‌కు ఆమె సూచించారు. సీఐ వరప్రసాద్, ఎస్‌ఐ మల్లికార్జున్ రెడ్డి తన సిబ్బందితో కలిసి ఎక్కడికక్కడ బారికేడ్లను ఏర్పాటు చేస్తూ, పోలింగ్ కేంద్రానికి వంద మీటర్ల దూరంలో ట్రాఫిక్ నియమాలు ఉండేలా ఏర్పాట్లు చేశారు. ఓటర్లు తమ వెంట ఓటర్ స్లిప్ లు తెచ్చుకోవాలన్నారు. కాగా ఎన్నికల్లో ఆరుగురు అభ్యర్థులు బరిలో ఉన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించండి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

రాయచోటి అర్బన్ : తాము ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు కృషిచేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నేతలు శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డికి విన్నవించారు. సీఐటీయూ రాష్ట్రకమిటీ పిలుపు మేరకు అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు ఎమ్మెల్యేను ఆయన కార్యాలయంలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తగా అమలులోకి తీసుకువచ్చిన ఎఫ్ఆర్ఎస్ వలన బాలింతలు, గర్భిణులకు సంపూర్ణ పోషణ పంపిణీకి సాంకేతిక సమస్య ఎదురవుతోందంటూ తెలిపారు. అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు అమలయ్యేలా చూడాలన్నారు. మినీ అంగన్‌వాడీ కేంద్రాలను, మెయిన్ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేయించాలని కోరారు. జనాభాకు అనుగుణంగా అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటు తదితర సమస్యలను పరిష్కరించాలంటూ ఎమ్మెల్యేకు విన్నవించారు. ఈ మేరకు ఒక వినతిపత్రాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎ.రామాంజులు, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు భాగ్యలక్ష్మి, బంగారుపాప, ఖాజాబీ, విజయమ్మ, నాగమణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

పని సర్దుబాటు ప్రక్రియను నిలిపివేయాలి



ఇన్‌చార్జ్ డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న ఫ్యాప్టో నేతలు

రాయచోటి అర్బన్ : బదిలీలు జరిగి 3 నెలల కాలం ముగియక మునుపే తిరిగి ఉపాధ్యాయులకు పని సర్దుబాటు చేయడం దారుణమని, సర్దుబాటు ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని ఫ్యాప్టో నేతలు ఆర్.రవిశంకర్, రవీంద్రనాథరెడ్డి, హరి బాబులు ఇన్‌చార్జ్ డీఈఓ ప్రసాద్‌బాబుకు విన్నవించారు. శుక్రవారం వారు ఇన్‌చార్జ్ డీఈఓను ఆయన కార్యాలయంలో కలుసుకుని మాట్లాడుతూ 2023 జూన్ నెలలో విద్యాశాఖాధికారులు ఉపాధ్యాయుల బదిలీలు, రేషనలైజేషన్, ప్రమోషన్స్ చేపట్టారన్నారు. బదిలీ అయిన సుమారు 10వేల మందికి పైగా ఉపాధ్యాయులకు గత 3 నెలలుగా జీతాలు అందలేదంటూ తెలిపారు. బదిలీల్లో రిలీవర్ రాలేదని వెయ్యిమందికి పైగా ఉపాధ్యాయులు ఇప్పటికీ రిలీవ్ కాకుండా అవే పాఠశాలల్లో కొనసాగుతున్నారన్నారు. ప్రమోషన్ పొందిన ఉపాధ్యాయులకు తక్షణమే జీతాలు చెల్లించేలా చూడాలంటూ వారు ఇన్‌చార్జ్ డీఈఓకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నేతలు సిబాతుర్ రహిమాన్, గఫార్‌ఖాన్, జాబీర్, శివారెడ్డి, ఇలియాస్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ స్టేషన్ అధికారులు

రాయచోటి టౌన్ : అగ్ని ప్రమాదాల నివారణపై విద్యార్థులకు రాయచోటి అగ్నిమాపకశాఖ అధికారి వెంకట్రామిరెడ్డి అవగాహన కల్పించారు. శుక్రవారం రాయచోటి పట్టణ పరిధిలోని మాసాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భోజన విరామ సమయంలో విద్యార్థులకు అగ్ని ప్రమాదాలు ఎలా సంభవిస్తాయి వాటిని ఎలా నివారించవచ్చో వివరించారు. అలాగే ఎక్కడైనా అగ్ని ప్రమాదాలలో ఇరుక్కుపోయిన వారిని, గాయపడిన వారిని ఎలా కాపాడాలో పలు రకాల విన్యాసాల ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఫైర్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు అతిథి భోజనం



విద్యార్థులకు అతిథి భోజనం వడ్డిస్తున్న పక్కీరారెడ్డి కుటుంబ సభ్యులు

గాలివీడు : మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో దివంగత మిట్టపల్లి పక్కీరారెడ్డి శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని విద్యార్థులకు అతిథి భోజనం ఏర్పాటు చేసినట్లు వారి కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వైస్ ఎంపీపీ మిట్టపల్లి యదుభూషన్ రెడ్డి మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ పరిపాలక సంఘం అధ్యక్షుడిగా పనిచేసి నిత్యం ప్రజాసేవకై పాటుపడిన మహోన్నత వ్యక్తి పక్కీరారెడ్డి అని తెలిపారు. దాతలు ముందుకొచ్చి పేద పిల్లలను దృష్టిలో పెట్టుకుని ఇలాంటి అతిథి భోజనాలు ఏర్పాటు చేస్తే విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు సింగిల్ విండో అధ్యక్షుడు మిట్టపల్లి వేద మూర్తి రెడ్డి, గోపిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్బారెడ్డి, ఆదినారాయణ రెడ్డి, కృష్ణారెడ్డి, బండి పరశురాం, గంగాధర్ నాయుడు, వినోద్ నాయుడు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

ప్రతి రైతు పంట నమోదు చేయించుకోవాలి



ఎరువులను పరిశీలిస్తున్న ఏడీఏ నాగరాజు

సిద్దవటం : మండలంలోని మాచుపల్లె రైతు భరోసా కేంద్రాన్ని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశామని బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రంలో డీఏపీ, యూరియా ఎరువులు పుష్కలంగా నిల్వ ఉన్నాయన్నారు. అవసరమైన రైతులు వినియోగించుకోవచ్చునన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో కలిసి స్థానిక రైతు క్రిష్ణారెడ్డి పొలంలో ద్రవ జీవామృతాన్ని తయారు చేయించారు. వరి పంటలో బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులును గమనించడం జరిగిందన్నారు. ఈ తెగులు నివారణకు నత్రజని ఎరువుల వాడకాన్ని వాయిదా వేయడం, పొటాష్ ఎరువును కనీసం ఎకరాకు 25 నుంచి 30 కిలోల వరకు 30 - 40 రోజులలోపు వాడాలన్నారు. ప్రతి ఒక్క రైతు ఈ పంటను నమోదు చేయించుకోవాలని తెలియజేసినట్టు చెప్పారు. రైతులు, రైతు భరోసా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాల్లో శ్రావణమాస పూజలు



ప్రత్యేక పూజలందుకుంటున్న శాంతి లింగేశ్వరస్వామి



పూజలందుకున్న శీతల గంగమ్మ

రాయచోటి టౌన్ : పట్టణంలోని కొత్తపేటలోని శ్రీ శివరామాలయంలో శ్రావణమాస పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే శివుడికి అభిషేకాలు, పూజలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం సెంట్రింగ్ వీరయ్య ఆధ్వర్యంలో శివరామయ్య దాతృత్వంతో భక్తులకు ఉచితంగా అన్నదానం చేశారు. పూజలలో మహిళలు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రతిభ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ అరమాటి శివగంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శీతల గంగమ్మకు పూజలు

సిద్దవటం : మండలంలోని పార్వతీపురంలో వెలసిన శీతల గంగమ్మకు శుక్రవారం భక్తులు పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు అమ్మవారికి అభిషేకం, అలంకరణ, గణపతిపూజ, పుణ్యహావాచనం, అమ్మవారికి కుంకుమార్చన వంటి పూజా కార్యక్రమాలను జరిపారు. అనంతరం వచ్చిన భక్తులు అమ్మవారి గుడి చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారిని దర్శించుకొన్నారు. కాయాకర్పూరాలను సమర్పించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

కిటకిటలాడిన శివాలయాలు

పుల్లంపేట : మండలంలోని పర్వతవర్ధిని శ్రీశాంతి లింగేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ మాస తొలి శుక్రవారం కావడంతో మహిళలు భారీ సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



భక్తులకు అన్నప్రసాదం అందిస్తున్న దాతలు

సంక్షేమ ప్రభుత్వానికి అండగా నిలవండి



లబ్ధిదారుకు సంక్షేమ బావుటాను అందించిన ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు

పెనగలూరు : అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని సింగనమల పంచాయతీలో మండల వైస్ ప్రెసిడెంట్ కొండూరు విజయ్‌రెడ్డితో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమన్ని నిర్వహించారు. కొత్త సింగనమల పాత సింగనమల గ్రామాలలో మండల స్థాయి అధికారులతో కలిసి గడప గడప కార్యక్రమంలో ఆయన చురుగ్గా పాల్గొన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి మహిళలను ఆప్యాయంగా పలకరిస్తూ మీ సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ప్రత్యేకంగా ప్రతి ఇంటి వద్ద ప్రజలను కోరారు. అర్హులుగా ఉండి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ఏమైనా అందకపోతే వాటిని అందేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. కొంత మంది ప్రభుత్వ పథకాలు అందలేదని తెలియజేస్తే వెంటనే స్పందించి సంబంధిత అధికారులను పిలిచి అక్కడికక్కడే పరిష్కరించారు. ముఖ్యంగా ప్రభుత్వం ఏర్పాటు అందజేసిన సంక్షేమ పథకాల లబ్ధిదారులకు వివరించారు. అలాగే గ్రామంలో రోడ్డు సమస్య ఉందని ప్రజలు అడగడంతో ఎంపీపీ విజయ్‌రెడ్డితో కలిసి వెంటనే పనులు ప్రారంభించాలని మాజీ జెడ్పీటీసీ సభ్యులు నరసింహులుకు తెలిపారు. జగనన్న కాలనీలో వర్షం వస్తే చెరువు నీరు కాలనీలో చేరుతోందని లబ్ధిదారులు తెలపడంతో మరో చోటుకు మార్చేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. ముఖ్యంగా నీటి సమస్య ఎక్కడైనా ఉందని ఆరా తీయగా నీటి సమస్య లేదని గ్రామ ప్రజలు కొరముట్లకు తెలిపారు. ప్రజల్లో మంచి స్పందన ఉన్న పచ్చమీడియా మాత్రం ప్రజలను ప్రభావితం చేసేందుకు తప్పుడు సమాచారం చేస్తోందన్నారు. సంక్షేమ పథకాలు ఇలాగే కొనసాగాలంటే జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రి చేయాలని ఆయన కోరారు.

అంగన్‌వాడీలకు త్వరలోనే శుభవార్త..

మండలంలోని అంగన్‌వాడీ టీచర్‌లకు సింగనమల గ్రామంలో ప్రభుత్వం మంజూరు చేసిన యూనిఫాంను అంగన్‌వాడీ టీచర్‌లు ఆయాలకు ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలపై త్వరలోనే ప్రభుత్వం నుంచి మంచి మాట వింటారని ఆయన తెలిపారు. దీంతో అంగన్‌వాడీ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల వైస్ ప్రెసిడెంట్ కొండూరు విజయ్‌రెడ్డి, జిల్లా టూరిజం డైరెక్టర్ జి.సుధాకర్‌రాజు, జెడ్పీటీసీ సభ్యులు సుబ్బారాయుడు, ముదిరాజ్ సంఘం రాష్ట్ర డైరెక్టర్ గుండ్లూరు ఈశ్వరయ్య, వ్యవసాయ సలహా మండలి మండల అధ్యక్షుడు సిద్దవరం శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్ ఎర్రి శివ, ఎర్రి నరసింహులు, తహసీల్దార్ శ్రీధర్‌రావు, ఎంపీడీఓ వరప్రసాద్ అన్ని శాఖల అధికారులు అంగన్‌వాడీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు భూమిపూజ

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని రాఘవరాజుపురం హరిజనవాడ వద్ద రూ. 5 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులకు శుక్రవారం సాయంత్రం ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ప్రతి పల్లెను పట్టణంగా తీర్చడమే లక్ష్యంగా పెట్టుకున్నారని తెలిపారు. పట్టణాలు, గ్రామాలు అభివృద్ధి చేయడమే సీఎం జగన్ లక్ష్యం అన్నారు. కార్యక్రమంలో ఏపీటీడీసీ డైరెక్టర్ సాయికిషోర్‌రెడ్డి, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్ రాజు, ఆర్‌వి.రమణ, మోహన్‌రెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

యానిమేటర్ల సమస్యలను పరిష్కరిస్తాం

రైల్వేకోడూరు : డ్వాక్రా యానిమేటర్లకు సంబంధించిన సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తానని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో డ్వాక్రా యానిమేటర్లు పలు సమస్యలపై ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులను కలిసి వినతి పత్రం అందజేశారు. అందులో ముఖ్యంగా మూడు సంవత్సరాల సర్క్యులర్‌ను పూర్తిగా తొలగించాలని, హెచ్ఆర్ పాలసీ కల్పించాలని, ఉద్యోగ భద్రత కావాలని, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం సమర్పించారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన కొరముట్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డ్వాక్రా సంఘం యానిమేటర్లు తదితరులు పాల్గొన్నారు.

అడ్మిషన్ ఫీజు చెల్లింపునకు గడువు పెంపు

రాజంపేట టౌన్ : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్శిటీలో ప్రథమ సంవత్సరం డిగ్రీలో ప్రవేశానికై అడ్మిషన్ ఫీజు చెల్లింపునకు సెప్టెంబర్ 5వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ఆ యూనివర్శిటీ స్థానిక కో-ఆర్డినేటర్ డాక్టర్ బి.పురుషోత్తం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ తత్సమానమైన కోర్సులు ఉత్తీర్ణులైన వారు డిగ్రీలో ప్రవేశానికి అర్హులన్నారు. వివిధ కారణాల రీత్యా రెగ్యులర్‌గా డిగ్రీ చదవలేని వారు, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే ద్వితీయ, తృతీయ సంవత్సరానికి సంబంధించిన అడ్మిషన్ ఫీజు చెల్లింపునకు కూడా సెప్టెంబర్ 5వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు పురుషోత్తం తెలిపారు.

తాగునీటి కష్టాలను తీర్చండి

లక్కిరెడ్డిపల్లె : మండలంలోని కాకులవరం పంచాయతీ కొత్తరాచపల్లెలో తాగునీటి కష్టాలకు వెంటనే పరిష్కారం చూపాలని సీపీఐ నాయకులు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం కొత్తరాచపల్లెలో ఆయన పర్యటించి తాగునీటిపై గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. దాదాపు 60 కుటుంబాలు నివాసం ఉంటున్న కొత్తరాచపల్లెలో తాగునీరు లేక పంట పొలాలలోని బోరు, బావు ల వద్దకు వెళ్లి తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొందని శ్రీనివాసులు ఎదుట గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారన్నారు. వెంటనే అధికారులు పరిష్కారం చూపకపోతే కలెక్టరేట్ కార్యాలయం వద్ద ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ మండల నాయకులు పాల్గొన్నారు.